నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 25 మార్చి 2025 RANGAREDDY


## పశువుల షెడ్ కాదిది.. వైకుంఠధామం



దుద్యాల మండలంలోని సంగాయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన వైకుంఠధామంలో కొందరు తమ ఎద్దులను ఉంచుతూ ఎద్దుల షెడ్‌గా మార్చేశారు.

–బొంరాస్‌పేట, మార్చి 24



కేశంపేటలో ఎండిపోయిన మొక్కజొన్న పంట

# మక్క రైతుకూ నష్టాలే..

- సరిపడా అందని నీరు.. ఎండిపోతున్న పంట
- రంగారెడ్డి జిల్లాలో 13,600 ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- పెట్టుబడి రాని పరిస్థితి నెలకొన్నదని అన్నదాత ఆవేదన

రంగారెడ్డి, మార్చి 24 (నమస్తే తెలంగాణ)/కేశంపేట : వరికి బదులుగా మొక్కజొన్న పంటను సాగు చేసిన అన్నదాతకు ముప్పుతిప్పలు తప్పడంలేదు. జిల్లాలో వాతావరణ పరిస్థితులతో రైతన్నకు నష్టాలు తప్పేలా లేవు. పంట కంకులు పెట్టే సమయంలో సరిపడా నీరందక ఎండుముఖం పడుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకున్నా.. అప్పులు తీసుకొచ్చి పంటను సాగు చేశామని.. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. జిల్లాలో 13,600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు.

షాద్‌నగర్, కేశంపేట, కొం దుర్గు, చౌదరిగూడ, షాబాద్, ఆమనగల్లు, తలకొండపల్లి తదితర మండలాల్లో అధికంగా సాగు చేయ గా.. పంట ఆశాజనకంగా లేకపోవడంతో దానిని పశువుల మేతకు వదిలిపెట్టారు. మరోవైపు పంటలు ఎండిపోతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

### తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నా..



చేతికొచ్చిన కొడుకులకు చేయూతనిచ్చేందుకు రూ.7 లక్షల వరకు అప్పులు చేసి మాకున్న భూమిలో మూడు బోర్లు తవ్వించా. ఆ పొలంలో మొక్కజొన్న పంటను సాగు చేయగా.. రోజురోజుకూ ఎండలు ముదురుతుండడంతో ఆ బోర్లలోని నీరు ఇంకిపోయి పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోయింది. నా భర్త కృష్ణయ్య 15 ఏండ్ల కిందట మృతి చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కుగా కాయకష్టం చేసి కుమారులను పెంచి పెద్ద చేశా. మొక్కజొన్న పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోవడం తీవ్రంగా కుంగదీసింది. బోర్లు వేయించేందుకు చేసిన అప్పులకు మిత్తీలు కట్టలేకపోతున్నా.

- రాములమ్మ, రైతు, కేశంపేట

### పంట పూర్తిగా దెబ్బతిన్నది..

నా పొలంలో నాలుగు బోర్లు ఉండడంతో నీటికి కొదవ ఉండదనే ధీమాతో 3.5 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశా. ఎండలు ముదరడంతో బోర్లన్నీ ఎండిపోయాయి. పంటను కాపాడుకునేందుకు మరో బోరు తవ్వించినా చుక్కనీరు రాలేదు. పంటల సాగుకు తీసుకొచ్చిన అప్పులు.. ఐదు బోర్లు వేయించేందుకు చేసిన అప్పును ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి

- కుమ్మరి లింగం, రైతు, సంతాపూర్, కేశంపేట





ఎండిపోయిన కంకిని చూపుతున్న రైతు

# డేంజర్ బెల్స్..

## వికారాబాద్ జిల్లాలో రోజురోజుకూ తగ్గుతున్న నీటినిల్వలు

- ఖాళీ అవుతున్న ప్రాజెక్టులు, చెరువులు
- కోట్‌పల్లి, లక్నాపూర్, సర్పన్‌పల్లి, కాక్రవేణి, జుంటుపల్లి ప్రాజెక్టుల్లో క్రమంగా తగ్గుతున్న నీళ్లు
- జిల్లాలోని అన్ని చెరువుల్లోనూ 30 శాతమే నీటినిల్వలు
- మార్చిలోనే నెర్రెలు తేలిన చెరువులు
- కేసీఆర్ హయాంలో నీళ్లతో నిండుకుండలా ఉన్న చెరువులు, ప్రాజెక్టులు



నీళ్లు లేక ఎండిపోయిన ధారూరు మండలంలోని ఎబ్బనూరు చెరువు

వికారాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఎండలు ముదరకముందే భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. మార్చి నెలాఖరులోనే జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువుల్లో నీటినిల్వలు తగ్గడంతో ప్రమాద ఘటికలు మోగుతున్నాయి. ప్రధాన ప్రాజెక్టులు, చెరువుల్లో నీటినిల్వలు తగ్గి నెర్రెలు పడ్డాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమంతో పూడికతీత పనులు చేపట్టి చెరువులకు పూర్వ వైభవం తీసుకొస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే చెరువుల్లో నీరు లేక కళ తప్పాయి. కేసీఆర్ ప్రభుత్వంలో చెరువులు, ప్రాజెక్టుల్లో పూడికతీత పనులతో మండు వేసవిలోనూ 90 శాతం మేర నీటినిల్వలు ఉండి భూగర్భజలాలకు ఎలాంటి ఢోకా లేని పరిస్థితులుండగా.. రేవం త్ సర్కార్‌లో చెరువులు, ప్రాజెక్టుల్లో పూడికతీత తీయించకపోవడం.. తూములు, కాల్వలు పాడైపోయినా వాటికి మరమ్మతులు చేయించకపోవడంతో నీరు నిల్వలేక అడుగంటిపోతున్నాయి. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన కోట్‌పల్లి, లక్నాపూర్, సర్పన్‌పల్లి, కాక్రవేణి, జుంటుపల్లి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. ఈనెల మొదటి వారం 90 శాతం వరకు నీటి నిల్వలుండగా, ప్రస్తుతం వాటిలో 50 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. అదేవిధంగా చెరువుల్లోనూ నీటి నిల్వలు తగ్గుతున్నాయి. మార్చి ముగియక ముందే చెరువుల్లో నీటి నిల్వలు 30 శాతానికి చేరుకున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతుండడంతో బోర్లు, బావుల్లోనూ నీటినిల్వలు తగ్గిపోతున్నాయి. కాగా జిల్లాలో 1179 చెరువులుండగా.. 85,000 ఎకరాల ఆయకట్టు ఉన్నది. తాండూరు డివిజన్‌లో 262 చెరువులు, కొడంగల్ డివిజన్‌లో 202, పరిగి డివిజన్‌లో 398, వికారాబాద్ డివిజన్‌లో 317 చెరువులున్నాయి. 1179 చెరువులుండగా మెజార్టీ చెరువుల్లో 25–30 శాతం మేర మాత్రమే నీటి నిల్వలున్నాయి.



ధారూరు : మున్నూరు సోమారంలోని చెరువులో అడుగుకు చేరిన నీరు

### మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం..

కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమంతో చెరువులకు పూర్వ వైభవం తీసుకొచ్చింది. పూడికతీత పనులతో కనీసం ఐదు టీఎంసీలకు పైగా వృథాగా పారే నీటిని ఒడిసి పట్టేలా చెరువులను అభివృద్ధి చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో కట్టలకు పలు చోట్ల గండ్లు, తూములకు లీకేజీలతోపాటు అలుగులు పాడవడంతో కురిసిన వర్షం నీరు ఎక్కువగా వృథాగా పోయేది. దానిని అరికట్టేందుకు చెరువులు, కుంటల్లో పూడికతీతతో పాటు వాటికి మరమ్మతులు చేయించడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. సగటున 20–30 ఎకరాలకు నీరందించే చెరువు మిషన్ కాకతీయ పనులతో 120–130 ఎకరాలకు నీరందించే స్థాయికి చేరింది. మిషన్ కాకతీయ పనులతో జిల్లాలోని చెరువులు వేసవిలోనూ నిండుకుండలా దర్శనమిచ్చాయి. చెరువుల్లో నీటి నిల్వలు, భూగర్భజలాలు పెరగడంతో జిల్లాలో ఆయా పంటల సాగు విస్తీర్ణం కూడా గత పదేండ్లలో గణనీయంగా పెరిగింది. 2014 అక్టోబర్‌లో 2.50 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉండగా మిషన్ కాకతీయలో భాగంగా చెరువుల పూడికతీత పనులతో 5,88,977 ఎకరాలకు పెరిగింది. దాదాపు రూ.246 కోట్ల 95 లక్షలతో నా లుగు విడతల్లో 790 చెరువులను పునరుద్ధరించారు.



## అర్హత లేకున్నా..

# నియామకమా?

- 'గాంధీ'లో సూపరింటెండెంట్ నియామకంపై అసంతృప్తి
- 'ఎన్‌ఎంసీ' ప్రకారం అర్హులు కాదనే వాదన
- దవాఖాన నిర్వహణ గాడితప్పుతున్నదని విమర్శలు




సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ప్రతిరోజూ సుమారు 2,000–3,000 పైగా ఓపీ రోగులకు, 2000 మంది రోగులకు ఐపీ సేవలు అందించే గాంధీ దవాఖానకు నిష్ణాతలైన, అనుభవజ్ఞులైన అధికారిని సూపరింటెండెంట్‌గా నియమించడం ఇప్పటివరకు కొనసాగిన ఆనవాయితీ. కానీ, ఇటీవల జరిగిన బదిలీల అనంతరం గాంధీ దవాఖానకు సూపరింటెండెంట్‌గా నియమితులైన వైద్యాధికారి ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం అర్హులు కాదనే వాదన ఉన్నది. నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న సదరు వైద్యాధికారిని అర్హత లేకున్నా కొందరు పెద్దల సిఫారసు మేరకు గాంధీ దవాఖానకు సూపరింటెండెంట్‌గా నియమించడంపై పలువురు వైద్యులు, అధికారులు అంతర్గతంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### నిబంధనలు ఏం చెబుతున్నాయి?

నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ)నిబంధనల ప్రకారం టీచింగ్ హాస్పిటల్‌కు సూపరింటెండెంట్‌గా నియమించాలంటే వారు క్లినికల్ ఓరియంటేషన్ కలిగి ఉండాలి. అంటే రోగులకు వైద్య చికిత్సలు అందించడంలో అనుభవం కలిగిన వారై ఉండాలి. దీంతోపాటు అదనపు డీఎంఈ హోదా కలిగి ఉండాలి. ప్రస్తుత సూపరింటెండెంట్ ఫిజియాలజీ చేశారు. ఫిజియాలజీ వారికి క్లినికల్ ఓరియంటేషన్ ఉండదు. అంటే వారు మెడికల్ ప్రాక్టీస్ చేసి ఉండరు. కేవలం బోధనకు మాత్రమే పరిమితమవుతారు. సాధారణంగా అదనపు డీఎంఈ హోదాతోపాటు క్లినికల్ ఓరియంటేషన్ కలిగి ఉన్న వారు టీచింగ్ హాస్పిటళ్లకు సూపరింటెండెంట్లుగాను, ఇతర అన్ని రకాల హోదాలకు అర్హులు. ఫిజియాలజీ వంటి నాన్ క్లినికల్‌కు చెందిన వారు అదనపు డీఎంఈ హోదా కలిగి ఉన్నప్పటికీ బోధన, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హోదాకు అర్హులవుతారు. కానీ ప్రస్తుతం గాంధీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారి అదనపు డీఎంఈ హోదా కలిగి ఉన్నప్పటికీ క్లినికల్ ఓరియంటేషన్ లేదని, అంత పెద్ద స్పెషాలిటీ దవాఖానకు ఎన్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా సూపరింటెండెంట్‌ను నియమించారని పలువురు సిబ్బంది చెబుతున్నారు.

### అంతా తానై..

క్లినికల్ పరంగా ఎలాంటి అనుభవం లేకపోవడంతోనే గాంధీ దవాఖాన నిర్వహణ గాడి తప్పుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గాంధీ దవాఖానలో రోగులకు సరైన వైద్యం, మందులు అందడం లేదని, పరిపాలనా పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, ఇప్పటికే అనేకసార్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితోపాటు డీఎంఈ స్థాయి అధికారులు సైతం దవాఖానను సందర్శించారు. ఈ నేపథ్యంలోనే దవాఖానలో విధులు నిర్వర్తిస్తున్న ఓ సీనియర్ ఆర్‌ఎంవోనే చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తున్నది. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో ప్రస్తుతం సూపరింటెండెంట్‌కు అన్నీ తానై దగ్గరుండి పరిపాలనా వ్యవహారాలను చక్కబెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా అంతిమంగా రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, నిత్యం వేల సంఖ్యలో రోగులు చికిత్స పొందే గాంధీ దవాఖాన వంటి పెద్ద దవాఖానలకు అర్హులైన, అనుభవజ్ఞులైన అధికారులను నియమిస్తే అటు రోగులకు, ఇటు వైద్యసిబ్బందికి మేలు జరుగుతుందని పలువురు వైద్య సిబ్బంది, రోగులు అభిప్రాయపడుతున్నారు.

# పంట చేను పశువుల మేతకు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కరువుఛాయలు కమ్ముకున్నాయి. సరిపడా వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగుంటుతున్నాయి. ఇప్పటికే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని పలు మండలాల్లోని చెరువులు, కుంటలు ఎండిపోయాయి. బోరుబావులు క్రమంగా వట్టిపోతున్నాయి. సరిపడా నీరందక పంటలూ ఎండిపోతున్నాయి. దీంతో చేసేదేమీ లేక అన్నదాతలు తమ పంటలను పశువులు, జీవాలకు మేతగా వేస్తున్నారు. ఆరుగాలం కష్టపడిన పంట చేతికొచ్చే దశలో కండ్ల ముందే ఎండిపోతుండడంతో వారు లబోదిబోమంటున్నారు.

-యాచారం/మర్పల్లి/ ధారూరు, మార్చి 24



రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లిలో ఎండిపోయిన వరి పంటను మేస్తున్న జీవాలు



### పదేండ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలే..

గత పదేండ్ల కాలంలో ఎప్పుడూ ఇలాంటి కరువును చూడలేదు. నాకున్న ఎకరం పొలంలో వరి పంట వేస్తే మొత్తం ఎండిపోవడంతో పశువులను మేపుతున్నా. రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత తీవ్ర కరువు వచ్చింది. వర్షాలు సరిగ్గా కురువకపోవడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. గత కేసీఆర్ హయాంలో పొలం మొత్తం సాగు చేసుకుని సంతోషంగా జీవించా. పంట సాగుకు తీసుకొచ్చిన అప్పులను ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

-కొర్ర సీతారామ్, కొర్రవాని తండా, మంచాల

### రూ. లక్ష అప్పు చేసి మొక్కజొన్న వేశా..

నాకు ఐదెకరాల పొలం ఉన్నది. అందులో రూ.1,00,000 వరకు అప్పు చేసి 4.20 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశా. బోరు బావుల్లోని నీళ్లు అడుగంటి దాదాపుగా రెండు ఎకరాల వరకు పంట పూర్తిగా ఎండిపోయింది. గత కొన్నేండ్లుగా మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నా. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి నెలకొనలేదు. భూగర్భ జలాలు పాతాళానికి చేరడంతో అన్నదాతకు కన్నీళ్లు ఆగడం లేదు. గత కేసీఆర్ హయాంలో సమృద్ధిగా వర్షాలు కురువడంతో ఏడాదికి రెండు పంటలు సాగు చేశా. భూగర్భజలాలు అడుగడంతో మండలంలో కరువుఛాయలు కనిపిస్తున్నాయి.

-పడమటి రాజేందర్ రెడ్డి, బూచన్‌పల్లి, మర్పల్లి





### మొత్తం పంట ఎండిపోయింది

దౌల్తాబాద్ : మండలంలోని దేవర్‌ఫస్లవాద్ గ్రామంలో దాదాపుగా 100 ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. అదే విధంగా సుల్తాన్‌పూర్ గ్రామంలో 50 ఎకరా లకు పైగా పంట ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారు. కాగా, దేవర్ ఫస్లవాద్‌కు చెందిన గొల్ల మల్లప్ప అనే రైతు రూ.లక్ష పెట్టుబడితో కౌలుకు 8 ఎకరాల భూమిని తీసుకుని వరిని సాగు చేయగా పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.



### ట్యాంకర్‌తో నీళ్లు అందించినా ఫలితం లేదు..

గతేడాది సమృద్ధిగా నీళ్లు ఉండడంతో నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. ప్రస్తుతం కూడా నాలుగు ఎకరాల్లోనే పంటను సాగు చేయగా.. బోరు బావిలో నీళ్లు లేకపోవడంతో మూడు ఎకరాల వరకు పంట పూర్తిగా ఎండిపోయింది. ఆ పంటను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశా. ట్యాంకర్‌తో నీటిని అందించినా ఫలితం లేదు. భూగర్భజలాలు అడుగంటుతుండడంతో అన్నదాతకు గుండె దడ తప్పడం లేదు.

పడమటి రుక్కీబాయి, పులిచింతల మడుగుతండా, ధారూరు

### విద్యుత్తు కోతలు, లో వోల్టేజీ సమస్యతో..

మూడున్నర ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. మొదట్లో బోరు నుంచి నీళ్లు బాగానే వచ్చేవి. వర్షాలు లేకపోవడం, ఎండలు ముదురుతుండడంతో భూగర్భజలాలు తగ్గి సాగునీటి ఎద్దడి మొదలైంది. దీనికి తోడు విద్యుత్తు కోతలు, లోవోల్టేజీ సమస్యతో చేతికొచ్చే దశలో ఉన్న రెండెకరాల పొలం ఎండిపోయింది. దీంతో ఆ పంటను పశువులు, జీవాలకు మేతగా వేస్తున్నా. ఆరుగాలం కష్టించిన పంట ఎండిపోవడంతో కుంగుబాటుకు గురయ్యాడు. పంట సాగుకు తీసుకొచ్చిన అప్పులు.. కుటుంబ పోషణకు తీసుకొచ్చిన అప్పులను ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు.

- సద్గుణాచారి, యువ రైతు మేడిపల్లి, యాచారం